

# వంతెన

## ఉషారాణి భాటియా

పార్వతి లోపలికి వస్తూనే హాలులో పెద్ద సంచలనం కలిగింది. వెయ్యి కళ్ళు తనమీద ఫోకస్ అయినట్లయి తడబడింది పార్వతి. కొందరు మెడలు అతి ప్రయత్నంమీద తిప్పి, సూటిగా పార్వతిని చూస్తున్నారు. కొందరు చూసీచూడనట్లు ముఖాలు పక్కకి తిప్పుకుని, మళ్ళీ ఆమె వైపే తిరుగుతున్నారు. కొందరి కనుబొమలు అనుమానంతో ముడిపడ్డాయి. కొందరి కనుబొమలు ఆశ్చర్యంతో పైపైకి వెళుతున్నాయి.

ఆ పెద్ద హాలునిండా చాలామంది పేరంటాళ్లే వున్నారు. నడుములు ఒంగి కూర్చోలేక ఆపసోపాలు పడుతున్న ముసలమ్మ దగ్గిరనుంచి తల్లి ఒళ్ళో కేరుమంటున్న పసిపాపవరకూ ఎందరో. ఎదురుగావున్న చిన్న వేదికమీద ఒకమ్మాయి వీణ వాయిస్తోంది. ఆ అమ్మాయి గొడవ ఎవరికీ పట్టినట్లు లేదు. పేరంటాళ్ళు తమలో తాము ఖబుర్లాడుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. గట్టిగానే ఛలోక్తులాడుకుంటున్నారు.

పాదం మోపేందుకు చోటులేని ఆ పేరంటాళ్ల మధ్యకి అడుగు పెట్టింది పార్వతి. మల్లెపూలుచుట్టిన పెద్ద ముడి, నారింజరంగు తెల్ల పట్టుచీర, మెళ్లో ముత్యాల దండ, చేతికి వాచీ — ముప్ఫయో పడిలో అడుగు పెడుతున్న పార్వతి వయసుకి మించిన అలంకరణ ఏమీ చేసుకోలేదు. కానీ అధునాతనంగా మటుకు వుంది. ఇటు కొంగులాగారెవరో. అటు కుచ్చెళ్ళు పట్టుకు గుంజారెవరో. తన పాత స్నేహితురాళ్ళ కోసరం ఆప్తుల కోసరం వెతుకుతున్న పార్వతి కళ్ళు సంబరంతో అల్లల్లాడుతున్నాయి.

'అదిగో పంకజం! అరె! అటు ఉంది మహాలక్ష్మి. సుందరమ్మగారదిగో అమూల! ఆ నీలం పట్టుచీరలో వున్నదే సుగుణ.'

పార్వతి కళ్ళు ఎంత తొందరగా నాలుగు పక్కలా చూస్తున్నాయో, హృదయం అంతవేగంగా గంతులు వేస్తోంది.

'ఇటుకేసి కూడా ఓసారి చూడవమ్మా! మెడ నొప్పెట్టదులే!' అంటూ చెయ్యిలాగి కూర్చోబెట్టింది చిన్ననాటి నెచ్చెలి సుగుణ. పార్వతి ధబీల్న కింద కూలబడి, చీర నలగకుండా రెండువైపులా పోగు చేసుకు కూర్చుంది. తల మీదుగా ఫాను లేదేమో చెమటలు కారి పోతున్నాయి. పర్సులోంచి రుమాలు తీసి నుదురు తుడుచుకుంది. దూరదూరంగా వున్న స్నేహితుర్ని, వారి వయస్థుల్ని చూసి నవ్వుతూ చెయ్యి వూపింది.

'ఏమమ్మోయ్. బొంబాయి వెళ్ళాక కాస్త నల్లబడినట్లున్నావే?'

ఓ ముసలమ్మ ఒంగి పార్వతి ముఖంలోకి చూసింది. 'నేనేమయినా అందాల పోటీకి వెళ్ళాలా?' అనుకుందామనుకుంది పార్వతి. కానీ చిరునవ్వే సమాధానంగా వూరుకుంది!

'ఇంకా వుద్యోగం చేస్తున్నావా? ప్రమోషనేమయినా వచ్చిందా?'

సౌమ్యకాంతితో కూడుకున్న ఆ ముఖం వంక యిబ్బందిగా చూసింది పార్వతి. తను వుద్యోగం చేస్తోందన్న తృప్తి, ఆత్మ విశ్వాసం ఎవరో తుడిచేసినట్లయింది ఆ ఒక్కమాటలో.

'ఆ! ఏదో గవర్నమెంటు వుద్యోగం. అంత త్వరగా పైకిపోవటం కుదరదే' అంటూ తప్పుచేసిన దానల్లే ముఖం పెట్టింది పార్వతి.

'పోనీ ఏదైనా ప్రయివేటు కంపెనీలో ప్రయత్నించక పోయావా? బొంబాయిలో చాలామందే చేస్తున్నారటగా?'

దూరంగా కూర్చున్న సుందరమ్మ లేస్తూ దగ్గిరికి వచ్చింది. తన సంపాదన లేకుంటే ఇల్లంతా పస్తుండేట్టు, ఆ మాటలు వింటుంటే చిరాకేసింది పార్వతికి.

'ఇంతకీ కొడుకు పుట్టాక లావయ్యావు కే!' చిన్న తనంలో తనతో ఆడిపాడి, ప్రాణమిచ్చిన సుగుణ కళ్లల్లో ఏం చూసి ఉలిక్కిపడింది పార్వతి

'ఇంట్లో ఎవరు? అత్తగారేనా? పిల్లవాడిని చూసుకునే దాదేనా?'

తన చేతులు పట్టుకుని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకోవలసిన లత దూరంనుంచే గంభీరంగా అడుగుతున్న ఈ ప్రశ్నకి విస్తుపోతూ చూసింది పార్వతి.

'బొంబాయి ఫ్యాషన్లు బాగా ఒంటబట్టినట్లున్నాయే? ఈ పర్సు అక్కడిదేనా?'

తన చేతిలోని పర్సు చాలా సులాగ్గా లాగి అటూ ఇటూ చూస్తున్న అరవింద, ఈమధ్య స్టేట్సుకూడా వెళ్లివచ్చిందేమో! ఈ పర్సులో ఏ క్రొత్త ప్రపంచం కనబడుతోంది చెప్మా? అని విస్తుపోయింది పార్వతి.

'మొన్న స్కూలు వార్షిక పత్రికలోనో ఏదో చూశాను బొంబాయి తెలుగువాళ్ల కార్యక్రమాల్లో బాగానే పాల్గొంటున్నట్లున్నావ్? ఉద్యోగం, సంసారం ఈ గొడవలో వీటికి తీరుబడి చేసుకుంటున్న నిన్ను మెచ్చుకోవాలి సుమా?'

వీపుమీద బలంగా చెయ్యి పడటంతో వెనక్కి తిరిగింది పార్వతి. కామాక్షమ్మ మాట ఎవరూ మెచ్చుకోలుగా వినటం లేదు. పైపెచ్చు

'ఏ పత్రికలో? ఇప్పుడేమిటి?' అంటూ ఒకర్ని ఒకరు పట్టుకుని ఆత్రంగా అడుగుతున్నారు— అదేదో ఎలక్షన్ ఫలితాల్లాగ.

'ఆ అదృష్టం అందరికీ వుండద్దు అండీ! మా అలిమేలు చూడండి! ఢిల్లీ వెళ్లిన సంవత్సరం పాటు అందరూ దాని చుట్టూతా తిరిగారు ప్రతి దానికీ. ఆ చలికి పడక జబ్బుచేసి, వుద్యోగం రాజీనామా యిచ్చి తిరిగి వచ్చేసింది. అటు అల్లుడికా ట్రాన్సఫరు దొరకటం లేదు. ఇటు పిల్లల చదువా పాడయి వూరుకుంది.'

అందరూ ఆ గొంతు వచ్చిన వైపు తిరిగి శ్రద్ధగా తలలు వూగిస్తున్నారు.

* * *

పెళ్లయిన సంవత్సరానికే తండ్రికి కలకత్తా బదిలీ అవటంతో, పుట్టి పెరిగిన హైదరాబాదుకి రావటం మళ్ళీ పడలేదు పార్వతికి. అయిదేళ్ళకి యిలా రావటం; వస్తూనే శ్రావణ మంగళవారం నోముల కంటూ పేరంటానికి పరుగెత్తటం జరిగింది. తన కళ్ళల్లోకి ఆపేక్షగా చూసే చూపులు, స్పర్శ, చలోక్తులు, హాయి; జ్ఞాపకాలు — దూది పింజల్లా ఎగిరిపోయి; ఆ స్థానంలో తన వంక కొత్తగా, పరిశీలనగా, విమర్శనాత్మకంగా చూస్తున్న పరిసరాల్ని బాధతో చూస్తోంది పార్వతి.

వాళ్లకిప్పుడు కావలసింది పార్వతి కాదు. పార్వతి మొగుడి జీతం. కారు మోడల్, టెలిఫోను సౌకర్యం. అత్తగారి ఆదరణ అంచనా. పిల్లవాడి తెలివితేటల కొలతలు. తన చేతినున్న గాజుల బరువు. నెక్లెసు వయస్సు. పార్వతి పార్వతిగా ఎవరికీ అక్కరలేదు. తనని ఒక వ్యక్తిగా, స్నేహితురాలిగా, పరిచయస్తురాలిగా ఎవరూ జ్ఞాపకం పెట్టుకోలేదు. ప్చ్! పార్వతి గుండెల్లో ఏదో బలంగా గుచ్చుకున్నట్లయింది.

* * *

ఆఖరి తాంబూలం పుచ్చుకుని లేచేటప్పటికి దీపాలు పెట్టారు. కొబ్బరికాయ, అరటిపళ్ళు, శనగలు ఒకచేతో, మరో చేతో చీరకుచ్చెళ్ళు పైకిపట్టుకుంటున్న పార్వతికి గడపదగ్గిర ఆ ఇంటి ఇల్లాలి గొంతు వెనకగా వినిపించింది.

'రేపెప్పుడైనా తీరుబడిగా రావమ్మా! కబుర్లు చెప్పుకుందాం; ముందుగా టెలిఫోనుచేసి మరీ రా'

'అలాగేనండీ'

పార్వతి వెనక్కి తిరిగయినా చూడకుండా ముందుకడుగు వేసింది. కాలినడకన ఇంటిముఖం పట్టింది. తలవొంచుకు నడుస్తున్న పార్వతి ముఖాన్ని నిరాశ, దిగులు ఆవరించాయి. అడుగులు బరువుగా పడుతున్నాయి. హృదయం రాయిలా అచేతనంగా వుంది. ఆమెకా అనుభవం అదో కొత్త రకమైనది. జీవితంలో ఎదురు చూడనిది.

'పార్వతమ్మా! ఓ పార్వతమ్మా!'

తనని కాదేమో అనుకుంటూనే తలెత్తింది పార్వతి.

రెండడుగుల దూరంలో నిలుచునుంది ఓ ఆడమనిషి. ఆ చిరుచీకట్లో కాస్త పరిశీలనగా చూస్తేగాని గుర్తురాలేదు.

'ఏం బాగున్నావా?'

ఓక్షణం ఆగి ప్రశ్నించింది పార్వతి.

'అదేంటమ్మా! గుర్తులేనా? అంత దూరంనుంచి చూసి పరుగెత్తుకొచ్చాను.'

తాయారమ్మ వగరుస్తోంది.

'ఎంత మారిపోయారమ్మా! ఇక్కడున్న రూపేలేదు,'

పార్వతి బుజంమీద చెయ్యివేసింది. ఆ చెయ్యి తడిగా, చల్లగావుంది. దగ్గిరగా వచ్చిన చీర ముతకకంపు కొడుతోంది. తాయారమ్మపళ్ళు తాంబూలంతో గార పట్టి, ఆ చీకట్లో మరింత నల్లగా వున్నాయి. పార్వతి కొంగుతీసుకుని ముక్కుకి అడ్డం పెట్టుకుంటూ ఒక్కడుగు వెనక్కి వేసింది. అసలే మనసు గజిబిజిగావుందేమో, మహ విసుగొచ్చేసింది.

ఇంతలో తాయారమ్మ చేతిలోని పాల గిన్నె కింద పెట్టి, రెండుచేతులతో పార్వతిని కౌగిలించుకుంది. ఎదురుచూడని ఈ స్వాగతానికి పార్వతి అదిరిపడింది. మెల్లిగా ఆ పట్టునుండి విడిపించుకుంది. రోడ్డుమీద ఎవరైనా చూస్తున్నారేమోనని పిచ్చిగా చుట్టూ కలియజూసింది.

తాయారమ్మ ఈమాటు పార్వతి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుంది. పార్వతి తెల్లబోతూ ఆమె వంకచూసింది. వీధి దీపం వెలుతురులో స్పష్టంగా కనపడుతున్నాయి తాయారమ్మ కళ్లల్లో మెరుస్తున్న నీళ్లు. అవి ఆ పేదరాలి

కళ్లల్లో పొంగి, ఆగకుండా చెంపలమీదుగా కిందికి జారుతున్నాయి. తాయారమ్మకి తెలీదు—వాటిని తుడిచేసుకోవాలని. తను పట్టుకున్న చేతులకి పౌడరు, సెంటువున్నాయని. తను కావలించుకున్న ఈ స్త్రీ హృదయంలో నిప్పులు చెరుగుతున్నాయని.

'అమ్మా వాళ్ళంతా బాగున్నారా? విన్నాళ్లో అయినట్లుంది చూసి. పోనీలే నిన్ను చూశా. నా కళ్లు చల్లగున్నాయి. ఆ రోజులేమో, ఆ యిల్లేమో — మళ్లీ



చూడలేదు...అట్లా...వస్తానమ్మా.'

చీకట్లో కలిసిపోతున్న ఆ పాలమనిషి ఒంక ఆలా చూస్తుండిపోయింది పార్వతి.

*   *   *

తను ఎవరికీ పార్వతిగా ఇక అక్కర లేదు, ఎంతో దూరమయిపోయింది అని వాపోతున్న తనకి ఇంత దగ్గిరగా అనిపిస్తోందేం ఈ తాయారమ్మ? ఎందుచేత? తనకి ఈమెకీ మధ్య లోతైన సముద్రం ప్రవహించటంలేదా? అందులో — హోదా, తారతమ్యాలు, పోటీభయం, అనుమానం, ఓర్వలేనితనం — అనే సుడిగుండాలు లేకపోవటం చేతనా? ఈ సముద్రాన్ని దాటేందుకు ఒక వంతెన కావాలా? ఆత్మసంస్కారమనే ఈ వంతెన తాయారమ్మ దాటగలిగిందా? ప్రస్తుతపు మన సమాజంలో ఈ సుడిగుండాలు, సముద్రాలు తప్పవా? తాయారమ్మ వీటిని ఎలా జయించింది? ఏమో! నమ్మ శక్యం కాకుండా వుంది! కేవలం ఒక పాలమనిషి పలకరించినంతమాత్రాన మురిసిపోయేటంత దిగజారిపోయిందా తను? ఛీ! ఛీ! తన కివాళ ఏమయింది?

*   *   *

మనసు దిటవుచేసుకుంటూ ఇంట్లో అడుగు పెట్టింది పార్వతి.

'ఏమే! అందర్నీ చూసివచ్చావా? కడుపు నిండిపోయిందా?'

పిన్నిమాట వినిపించుకోకుండా లోపలికి వెళ్ళింది. తల ముడివిప్పుకుంటున్న పార్వతికి వంటింట్లో మాటలు వినపడుతున్నాయి.

'ఇవాళ బజార్లో లక్ష్మి కనపడింది. అదే! పూర్వం మనింట్లో పాలుపోసే తాయారమ్మ ఒదిన. రెండునెలలయిందిట తాయారమ్మ మొగుడుపోయి, పాల వ్యాపారం పడిపోయి పిల్లలతో నానా అవస్థ పడుతోందిట.'

'ఆ పోనిద్దురూ పిన్నిగారూ! వీళ్ల కష్టాలు, సమస్యలు అలా ఒకటి కాక పోతే ఒకటి పుట్టుకొస్తూనే వుంటాయి. ఏముంది! మీరు వూళ్లో దిగారని తెలిసి లక్ష్మి ఈ మాటలు మోసుకొచ్చింది. రేపొద్దున్నే తయారవుతుంది. ఏ వైనా నాలుగు డబ్బు లివ్వమని.'

పార్వతి స్థాణువులా నిలబడిపోయింది. ఆమె కళ్లముందు ఇప్పుడు తాయారమ్మ రూపం, ఆమె కళ్లల్లో ప్రవహించిన నీళ్లు లేవు తన ప్రవర్తన, తనలో రేగిన ఆలోచనలకి బిడియం విచారం లేవు.

మానవత్వంమీద అపారమైన నమ్మకం, ఆశ ఆమె హృదయంలో మెదులుతున్నాయి. ఆ ఆశ్చర్యంనుంచే ఆనందం వెల్లివిరిసి ముఖం విప్పారింది. ●






"బరకగా ఉండే పాత కాలపు పళ్ల పొడులు మీ చిగుళ్లకు పళ్లకు చెరుపు చేస్తాయి...!"




కాల్గేట్ టూత్ పౌడరుతో మీ చిగుళ్లను, పళ్లను కాపాడుకోండి. చెడు శ్వాసను అరికట్టండి!

కాల్గేట్ టూత్ పౌడరుతో అధునాతన దంత సంరక్షణ పొందుపైనది—దాని చల్లని ఉల్లాసకరమైన రుచిని మీరు ఎంతో మెచ్చుకుంటారు! మీ కుటుంబం కోసం ఈ నాడే ఒక డబ్బా కొనండి!

SP.G. 20. TE